భలే గిరాఖీ

- సిరిసిల్లలో తయారీ.. ఇతర ప్రాంతాలకు ఎగుమతి
- స్థానిక మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం అంటేనే బీడీలు.. సాంచాల ముచ్చట వినిపిస్తోంది. కానీ కొన్నాళ్లుగా స్థానిక మహిళలకు వినూత్నమైన ప్రత్యేక ఉపాధి లభిస్తుంది. ఔత్సాహిక దంపతులు మొదలుపెట్టిన రాఖీ తయారీ కేంద్రం.. వందలాది అతివలకు ఉపాధి కేంద్రంగా నిలుస్తోంది. ఇక్కడ తయారవుతున్న రాఖీలు అందంగా ఆకర్షిస్తుండడంతో వివిధ ప్రాంతాల్లో గిరాఖీ₹ బాగుంది. మార్కెట్‌కు అనుగుణంగా ఏటా ఉత్పత్తి పెంచుతుండడంతో మహిళలకు కూడా ఏడాదిలో ఆరు నెలలపాటు పని లభిస్తుంది. అందమైన రాఖీ తయారీ.. మహిళల ఉపాధిపై సండే స్పెషల్.





సిరిసిల్లలో తయారైన అందమైన రాఖీలు

➡ మేకిన్ సిరిసిల్ల

సిరిసిల్లలో బీడి పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా రాఖీ పరిశ్రమ నడుస్తోంది. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, కోల్‌కత ప్రాంతాల్లో తయారయ్యేవి. కానీ నేడు స్థానికంగానే రాఖీలు తయారవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జీపీ నగర్‌కు చెందిన అవదూత తేజస్విని–శ్రీహరి దంపతులు తొమ్మిదేళ్లుగా రాఖీ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఖరీదు తక్కువగానే ఉండడం నాణ్యతలో రాజీపడకపోవడంతో ఈ రాఖీలకు మార్కెట్‌లో డిమాండ్ కూడా ఉంది. ఇక్కడ తయారయ్యే రాఖీలు ఇతర నగరాలకు ఎగుమతి అవుతుండడంతోపాటు స్థానికంగా పలువురు వ్యాపారులు ఇక్కడి నుంచే తీసుకెళ్లి పండుగ సమయంలో విక్రయిస్తున్నారు.

➡ అదిరేటి డిజైన్లు

ఇక్కడ రూ.2 మొదలుకుని రూ.100 వరకు ఖరీదు చేసే రాఖీలు తయారవుతున్నాయి. వేలాది డిజైన్లలో తయారుచేస్తూ సిరిసిల్ల, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేటలో ఏడాది పొడవునా 20 లక్షల రాఖీలు తయారు చేస్తున్నారు. నేత కుటుంబానికి చెందిన తేజస్విని, శ్రీహరి దంపతులు, రమేశ్‌తోపాటు పలువురు వ్యాపారులు ముంబయి, కోల్‌కత, ఢిల్లీ నగరాల్లో తయారయ్యే రాఖీలకు తీసిపోని విధంగా తయారు చేస్తున్నారు. స్థానిక పద్మనగర్, జీపీ నగర్ ప్రాంతాల్లో 300 మంది రాఖీల తయారీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్నారు.

➡ వేలాది రకాలు

జోరీస్, స్టోన్, రుద్రాక్ష మోడల్స్‌తోపాటు పిల్లలు ఇష్టపడే బెన్‌టెన్, ఫ్రెండ్‌షిప్ రాఖీలు దాదాపు 5వేల డిజైన్లలో తయారవుతున్నాయి. తక్కువ రేట్లతో బ్రాండెడ్ కంపెనీల రాఖీలను మరిపించడంతో ఆర్డర్లు విరివిగా వస్తున్నాయి. ముడిసరుకును ముంబయిలోని మల్లాడ్ ప్రాంతం నుంచి తీసుకొస్తున్నారు. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా రంగురాళ్లు, సిల్వర్, గోల్డెన్, దేవుళ్ల బొమ్మలు, వివిధ పార్టీల గుర్తులతో రాఖీలను తయారు చేయడం వీరి ప్రత్యేకత.

తక్కువ రేట్లలో లేటెస్ట్ రాఖీలు



తక్కువ రేట్లలోనే సిరిసిల్ల రాఖీలు లేటెస్ట్ డిజైన్లలో లభ్యమవుతున్నాయి. మార్కెట్లో చూస్తే ఇక్కడ తయారైన రాఖీలే బాగున్నాయి. నాణ్యతతో వివిధ బ్రాండెడ్ కంపెనీల రాఖీలకు తీసిపోనివిధంగా తయారు చేయిస్తున్నారు. చాలా మంది మహిళలు ఇంటి నుంచే ఉపాధి పొందుతున్నారు.

– పుల్లూరి అర్చన, సిరిసిల్ల

ఇతర నగరాలకు ఎగుమతి చేస్తున్నాం



మేము తయారు చేయించే రాఖీలు జిల్లాతోపాటు ఇతర పెద్ద నగరాలకు ఎగుమతి చేస్తున్నాం. మార్కెట్లో మాకో మంచి బ్రాండ్ ఇమేజ్ సాధించడం సంతోషదాయకం. బీడీకార్మికులు ఎక్కువగా వచ్చి మా వద్ద రాఖీలు తయారు చేస్తున్నారు. ఇంటి వద్ద ఉండే సంపాదించుకునే అవకాశాన్ని శ్రామిక మహిళలకు కల్పిస్తున్నాం. ఇప్పుడిప్పుడే సీజన్ మొదలైంది.

– అవదూత శ్రీహరి, తయారీదారు

క్లుప్తంగా

సీఎమ్మార్ఎఫ్ చెక్కులు పంపిణీ



అగ్రహారంలో చెక్కులు ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అగ్రహారంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు మామిండ్ల కిషన్ శనివారం పంపిణీ చేశారు. పర్శరాములు, రాములు, ఎల్లం పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ల పంపిణీ



పొత్తూరులో కిట్లు పంపిణీ చేస్తున్న వేణు

ఇల్లంతకుంట: పొత్తూరు, ముస్కానిపేటల్లో శనివారం మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. జక్కుల నాగరాజు, తిరుపతి, షాదుల్, అనిల్, శేఖర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించాలి



కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట నుంచి కోరుట్లపేటకు వెళ్లేదారిలో కూలిపోయిన కల్వర్టును పీఆర్ డీఈ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ నిధులు రాగానే కూలిన కల్వర్టు స్థానంలో కొత్తగా 500 మీటర్ల పొడవు మట్టిని నింపి సైడ్ వాల్స్ నిర్మిస్తామని తెలిపారు. వార్డు సభ్యుడు పందిర్ల శ్రీనివాస్ ఉన్నారు.

అమరజవాన్‌లకు నివాళి



సనుగులలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

చందుర్తి : చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. అమర జవాన్‌లకు నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ముఖేశ్, ఉపాధ్యాయులు కోరెపు శ్రీనివాస్, నాతరి నాగహాణి, చింతల హరీష్మా, మాధవి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

రెయిన్ డే



చందుర్తి: చందుర్తి మండలం మర్రిగడ్డ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం రెయిన్ డే నిర్వహించారు. విద్యార్థులు రంగుల కాగితాలతో ఏర్పాటు చేసిన పడవలను వర్షపు నీటిలో వేసి సంబరాలు జరుపుకున్నారు. వర్షంలో గొడుగులు పట్టుకొని మురిసిపోయారు. టీచర్లు భార్గవి, రామస్వామి ఉన్నారు.

విద్యార్థి దశలో కష్టపడితే ఉన్నత శిఖరాలకు..

వేములవాడరూరల్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని డాక్టర్ వంగ అనిల్‌కుమార్ అన్నారు. వేములవాడరూరల్ మండలం హన్మాజిపేట జెడ్పీ హెచ్ఎస్‌లో శనివారం రోల్‌మోడల్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన తాను చదువుకొనే రోజుల్లో విద్యపై ఇంత అవగాహన లేదని, ప్రస్తుతం విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు, అవగాహన ఉన్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం చిట్నేని శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ వాయిదా

బోయినపల్లి: మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాల చేతుల మీదుగా జరగాల్సిన రేషన్ కార్డుల పంపిణీ వాయిదా పడినట్లు డిప్యూటీ తహసీల్దార్ భూపేశ్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లబ్దిదారులు ఇబ్బందులు పడతారని కార్డుల పంపిణీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీ తేదీ త్వరలో తెలియచేస్తామని తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయండి

ఇల్లంతకుంట: బస్టాండ్ ఆవరణలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని మండల యువజన సంఘాల జేఏసీ కన్వీనర్ మామిడి విజయ్ ప్రకటనలో కోరారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే మహిళలు అత్యవసర సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వన మహోత్సవం.. పర్యావరణ హితం



మొక్క నాటుతున్న జిల్లా జడ్జి నీరజ, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్‌జాదవ్, న్యాయవాదులు

వేములవాడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ కోరారు. వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్‌తో కలిసి మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కేజీ టు పీజీ’లో ఆచార్య జయశంకర్ విగ్రహం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆచార్య జయశంకర్ విగ్రహం ఏర్పాటుపై ఎస్పీ మహేశ్ బీ గీతేతో కలిసి స్టాట్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య జయశంకర్ చిత్రపటం ఉంటుందని, అక్కడే విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు అవసరమైన చర్యలను ఆర్అండ్‌బీశాఖ అధికారులు తీసుకోవాలని సూచించారు. ఆర్అండ్‌బీ ఈఈ నర్సింహాచారి, పీఆర్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ కిశోర్, ఎంపీడీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గీతే

నానో యూరియాతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏవో దుర్గరాజు



తంగళ్లపల్లిలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న డీఏవో అఫ్జల్‌బేగం

- నానో యూరియాతో అధిక దిగుబడులు

ముస్తాబాద్/తంగళ్లపల్లి: నానో యూరియాతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం పేర్కొన్నారు. తంగళ్లపల్లిలోని దుకాణాలను శనివారం తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. అర లీటర్ నానో యూరియా 45 కిలోల బస్తాతో సమానమన్నారు. అర లీటర్ నానో యూరియా 2–4 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ముస్తాబాద్ రైతువేదికలో రైతులకు శనివారం మండల వ్యవసాయాధికారి దుర్గరాజు నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ అధిక యూరియా వాడడం ద్వారా నేలకు, పంటకు నష్టం జరుగుతుందన్నారు. ఇఫ్కో మేనేజర్ నరేశ్, ప్యాక్స్ డైరెక్టర్ బాలెల్లం, బి.రాజు, సీఈవో భార్గవ్, తంగళ్లపల్లి మండల వ్యవసాయాధికారి కనవేని సంజీవ్, ఏఈవోలు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వల తనిఖీ

కోనరావుపేట: మండలంలోని కొలనూర్, కోనరావుపేట సింగిల్‌విండో కార్యాలయాల్లో ఎరువుల నిల్వలపై అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా సహకారాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సింగిల్‌విండో కార్యాలయం సందర్శించారు. కార్యాలయంలో ఉన్న ఎరువుల వివరాలు తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి సందీప్, సీఈవోలు గాజుల రాజేశం, కేశవులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



హుజూరాబాద్ ఎమ్మెల్యేపై టౌన్ సీఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రేవంత్ మిత్ర మండలి, కాంగ్రెస్ నాయకులు

వేములవాడ/ఎల్లారెడ్డిపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో కాంగ్రెస్ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు న్యాత నవీన్ నేతృత్వంలో ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డిపేటలో ఎస్సై రాహుల్‌రెడ్డికి రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి, సోషల్‌మీడియా కన్వీనర్ ఇలియాస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. నాయకులు చిట్ల శ్రీనివాస్, నక్క సాయి, గసికంటి అశోక్, సందెల శశికుమార్, షేక్ ఇర్ఫాన్, కాసర్ల భాస్కర్, ఎండి షాహిద్‌పాషా, మల్లారం రాజేందర్, మ్యాదరీ జాన్సన్, సాయి, బాబా, రాజేశ్, తేజ, షాకీర్, శ్రీకాంత్, హరికృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



సిరిసిల్ల ఎడ్యుకేషన్: తాము చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు అండగా ఉండి విద్యాలయ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు పాటుపడడం అభినందనీయమని హెచ్ఎం భాగ్యరేఖ పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న 300 మంది విద్యార్థులకు ఐడీకార్డులు, టై, బెల్ట్‌లను పూర్వ విద్యార్థులు కొక్కుల తిరుపతి, అన్నల్‌దాస్ సత్యనారాయణ, ఊషకోయల మనోహర్, గడ్డం ఆంజనేయులు శనివారం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు గుత్తికొండ రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాసరావు, కోడం భారతి, ఎండీ సలావుద్దీన్, అడువ కీర్తి, ఇప్పకాయల ప్రకాశ్, విశ్వనాథుల శరత్‌బాబు, గంగారాం, కరుణశ్రీ, పద్మ, బొడ్డు శ్రీనివాస్, రాధాకిషన్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై పోరాటం



సిరిసిల్లటౌన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మూషం రమేశ్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27న సిరిసిల్ల చేనేత వస్త్రవ్యాపార సంఘంలో బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి బీడీకార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు ముఖ్య అతిథిగా బీడీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమా, రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి హాజరవుతారని తెలిపారు. సూరం పద్మ, శ్రీరాముల రమేశ్ చంద్ర, జిందమ్ కమలాకర్, దాసరి రూప, బెజిగం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

వేములవాడరూరల్: పల్లెల్లో బెల్ట్ షాపుల నిర్వహణ జోరుగా కొనసాగుతుంది. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని నాగాయపల్లి, మర్రిపల్లి, నూకలమర్రి, ఎదురుగట్ల, మల్లారం తదితర గ్రామాల్లో కొంతమంది బెల్ట్ షాపులు నిర్వహించడం వల్ల రాత్రివేళ మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వేములవాడకు కూతవేటు దూరంలోని నాగాయపల్లి ప్రధాన రోడ్డు పక్కన బెల్ట్ షాపును నడిపిస్తున్నారు. అటు గ్రామ పంచాయతీ, ఇటు రేషన్‌షాప్ మధ్యలో ప్రధాన రోడ్డున పక్కన బెల్ట్ షాపు నిర్వహించడంతో ఈ ప్రాంతంలో మహిళలు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఇక్కడ అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. బెల్ట్ షాపు నిర్వహించొద్దని వేములవాడ ఎక్సైజ్ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజులు మూతపడిన బెల్‌షాపు మళ్లీ యథావిధిగా కొనసాగుతోందని మహిళలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై వేములవాడ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావును వివరణ కోరగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ఏ గ్రామం నుంచి ఫిర్యాదు రాలేదని, నాగాయపల్లి నుంచి ఫిర్యాదు వస్తే విచారణ జరిపి కేసు నమోదు చేశాం, అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి బెల్ట్‌షాపులు నిర్వహించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్‌తోనే మంచి రోజులు

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌తోనే మంచి రోజులు వస్తాయని ఆ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ ఉప్పల్ పరిధి మల్లాపూర్ డివిజన్‌లోని వీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ శిక్షణ తరగతులకు శనివారం 30 మంది విద్యార్థి నాయకులతో హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి బీఆర్ఎస్వీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్, పట్టణాధ్యక్షుడు మెట్టెల సాయిదీపక్, కనుకుంట్ల వెంకటరమణ, వలబోజు రమణాచారి, రాచమల్లు మోహన్, శివరాత్రి భరత్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన గుండం శ్రీనివాస్ ఇల్లు నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి శనివారం కూలిపోయింది. శ్రీనివాస్ కుటుంబం నిలువ నీడ లేక రోడ్డున పడింది. ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈవో ప్రవీణ్‌కుమార్, నాయకులు చెన్ని బాబు, ద్యాగం లక్ష్మీనారాయణ, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, గంట బుచ్చాగౌడ్ కూలిన ఇంటిని పరిశీలించారు.

ఆర్థికసాయం అందజేత



కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటకు చెందిన వడ్నాల రామలక్ష్మి పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు కూలడంతో ప్రభుత్వం నుంచి వచ్చే తక్షణ సాయం కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నందుగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు ఎక్కల్‌దేవి శ్రీనివాస్ రూ.4500 అందజేశారు.

సారూ.. ఈ రోడ్డును బాగుచేయండి

ఇల్లంతకుంట(మానకొండూర్): మోకాలు లోతు గుంతలుపడ్డ రోడ్డుపై కలెక్టర్, ఎమ్మెల్యే వాహనాలు అపసోపాలు పడుతూ వెళ్లాయి. ఈ దృశ్యం శనివారం మండలంలోని రహీంఖాన్‌పేట, వెల్జీపురం గ్రామాల మధ్య కనిపించింది. ఈ రోడ్డు మొత్తం గుంతలు పడి వర్షానికి బురదమయంగా మారింది. ఈ బురదరోడ్డుపై నుంచే కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వాహనాలు అపసోపాలు పడుతూ వెళ్లాయి. రహీంఖాన్‌పేటలోని మోడల్‌స్కూల్‌లో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని రహీంఖాన్‌పేట గ్రామస్తులు కోరుతున్నారు.



రహీంఖాన్‌పేట బురద రోడ్డుపై వెళ్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేల వాహనాలు

జోరు వాన



వరద రావడంతో బారికేడ్లు పెట్టిన పోలీసులు

సిరిసిల్లటౌన్: జిల్లాలో శనివారం జోరువాన కురిసింది. రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజాజీవనం స్తంభించింది. జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలైన పాతబస్టాండు, సంజీవయ్యనగర్, కరీంనగర్ ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచింది. సంజీవయ్యనగర్ కమాన్ వద్ద వరదనీటి ప్రవాహం రావడంతో బారికేడ్లతో మూసివేశారు. అత్యధికంగా మానాల, అత్యల్పంగా ఇల్లంతకుంటలో వర్షపాతం నమోదైంది. మానాలలో 45మి.మీ, గంభీరావుపేట 38.8, నామాపూర్ 37.8, వట్టెంల 36.3, పెద్దలింగాపూర్ 32.3, బోయినపల్లి 31.3, మర్రిగడ్డ 31.3, నేరెళ్ల 29.3, ఆవునూరు 28.5, మల్లారం 26, పెద్దూరు 22.5, నాంపల్లి 22.3, ఎల్లారెడ్డిపేట 21.8, నిజామాబాద్ 21.5, గజసింగవరం 21.3, కందికట్కూర్ 20.5, మర్తనపేట 19.8, సిరిసిల్ల 19.3, రుద్రంగి 19, వీర్నపల్లి 18.5, ఇల్లంతకుంట 18.3మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

‘బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి’



ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, గూడూరు మాజీ సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు పేర్కొన్నారు. మండలంలోని గూడూరులో ఎమ్మెల్సీ సురేశ్‌రెడ్డి నిధుల ద్వారా మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో సామాజిక భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ప్రభాకర్, వంగూరి దిలీప్, మందాటి పద్మ, నాంపల్లి, వెంకటేశ్ ఉన్నారు.

బైక్ ఇక్కడ.. చలాన్ అక్కడ



కరీంనగర్‌లో ట్రిపుల్ రైడింగ్ అంటూ మెసేజ్ రూపంలో వచ్చిన ఫొటో

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టు పీజీలో శివకుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 23న పాఠశాలకు హాజరయ్యాడు. కానీ మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్‌లో ట్రిపుల్ రైడింగ్ అంటూ రూ.1,235 జరిమానా చెల్లించాలంటూ తన మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అవాక్కైన టీచర్ శివకుమార్ అది తన వాహనం కాదని, తాను కరీంనగర్ వెళ్లలేదని ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. స్టేట్ ట్రాఫిక్ పోలీస్ కంట్రోల్‌రూమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే అధికారులు స్పందించడం లేదన్నారు. చేయని తప్పునకు చలానా విధించడం ఎంత వరకు సమంజసమని శివకుమార్ ప్రశ్నిస్తున్నారు.

మట్టికుండపై మినరల్ వాటర్



మట్టికుండపై మినరల్ వాటర్ బబుల్

వేములవాడ: ఈ చిత్రంలో కనిపిస్తోంది ఒక సంప్రదాయ మట్టి కూలర్ (మట్టి కుండ)పై వేసిన మినరల్ వాటర్ బాటిల్. పట్టణంలోని తల్లం కాంప్లెక్స్‌లోని చిన్న హోటల్ అల్లిక, ప్లాస్టిక్ కుర్చీలు, మెనూ బోర్డు కనిపిస్తూ ఒక సాధారణ చాయ్ సెంటర్ వాతావరణం కనిపిస్తుంది. మట్టికుండలో ఉండే చల్లదనం ఆరోగ్యానికి మంచిదనే ఆలోచనతో, ఫ్రిజ్ నీటి బదులుగా ఇది ఉపయోగించడంతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఈ చిత్రం నిదర్శనంగా నిలుస్తోంది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: ✆ 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899